E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 25 -05-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రాష్ట్ర ఈఎన్సీ లేఖ » 2లో

త్వరలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు.. ₹800కే అపరిమిత డేటా! » 4లో



పోతూ పోతూ పంజాబ్‌కు షాక్.. విజయంతో సీజన్‌ను ముగించిన ఢిల్లీ » 6లో



కేన్స్‌లో అడుగుపెట్టిన అలియా.. ఫొటోలు షేర్ చేసిన నటి » 5లో



ఈపీఎఫ్ వడ్డీ రేటు ఖరారు చేసిన కేంద్రం » 4లో

EPFO

# మనమంతా టీమిండియా

**కేంద్ర రాష్ట్రాలు కలసికట్టుగా సాగాలి: మోదీ**
**అప్పుడు ఏ లక్ష్యమూ అసాధ్యం కాదు**
**నీతి ఆయోగ్ భేటీలో సీఎంలకు పిలుపు**
**రాష్ట్రానికో ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం**
**ప్రగతి వేగం పెంచుదామన్న ప్రధాని**




ఈ కబురు,న్యూఢిల్లీ: కేంద్రం, రాష్ట్రాలను 'టీమిండియా'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. అవి కలసికట్టుగా పని చేస్తే ఏ అభివృద్ధి లక్ష్యమూ అసాధ్యం కాబోదని ధీమా వెలిబుచ్చారు. శనివారం ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ పాలక మండలి 10వ భేటీకి ఆయన సారథ్యం వహించారు. వికసిత భారత్-2047 థీమ్‌తో భేటీ సాగింది. 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ప్రతినిధులు భేటీలో పాల్గొన్నట్టు నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం వెల్లడించారు. పశ్చిమబెంగాల్, బిహార్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలు పాల్గొనలేదని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ముఖ్యమంత్రులతో మోదీ సమావేశమవడం ఇదే తొలిసారి. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రం ఏర్పాటయ్యేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు. పహల్గాం ఉగ్ర దాడి లక్ష్యాల్లో జమ్మూకశ్మీర్‌లో పర్యాటకాన్ని దెబ్బ తీయడం కూడా ఉన్న నేపథ్యంలో ఈ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. ''ప్రతి గ్రామం, ప్రతి మున్సిపాలిటీ, ప్రతి నగరం, ప్రతి రాష్ట్రమూ ప్రగతి సాధించడమే మన లక్ష్యం కావాలి. అప్పుడు దేశమంతా దానంతటదే వృద్ధి చెందుతుంది. గడువు లోపలే వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఆ దిశగా అభివృద్ధి పనుల వేగం మరింత పెంచుదాం. 140 కోట్ల పైచిలుకు భారతీయుల ఆకాంక్షలను నెరవేరుద్దాం'' అని రాష్ట్రాలకు ప్రధాని పిలుపునిచ్చారు. భారత్‌లో పట్టణీకరణ శరవేగంగా సాగుతోందని గుర్తు చేశారు. కనుక నగరాలను సుస్థిరాభివృద్ధి, ఇన్నోవేషన్ల కలబోతగా, భవిష్యత్ అవసరాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ''మహిళా శక్తికి మరింత ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే మనమంతా ఆశించిన విధంగా దేశప్రగతి సాధ్యపడుతుంది. శ్రామిక శక్తిలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలి. అందుకు అనుగుణంగా చట్టాలు, విధానాలను రూపొందించుకోవాలి'' అని మోదీ చెప్పారు. తరువాయి 2లో


# పోటీల నుంచి వైదొలగిన మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ?

భారత్‌లో జరుగుతోన్న 72వ మిస్‌వరల్డ్ పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ -2025 మిల్లా మాగీ వైదొలిగిన విషయాలపై మిస్ వరల్డ్ సంస్థ స్పందించింది.

ఈ కబురు,హైదరాబాద్: భారత్‌లో జరుగుతోన్న 72వ మిస్‌వరల్డ్ పోటీల నుంచి మిస్ ఇంగ్లాండ్ -2025 మిల్లా మాగీ వైదొలిగిన విషయాలపై మిస్ వరల్డ్ సంస్థ స్పందించింది. తెలంగాణ రాష్ట్రం తొలిసారి ఆతిథ్యం ఇస్తున్న మిస్ వరల్డ్–2025 అందాల పోటీల చుట్టూ తీవ్ర వివాదం ముసురుకుంది! వ్యక్తిగత కారణాలతో పోటీల నుంచి వైదొలగుతున్నట్లు చెప్పి స్వదేశం వెళ్లిపోయిన మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ తాజాగా 'ద సన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పోటీల తీరుపై సంచలన ఆరోపణలు గుప్పించారు. తాను వేశ్యననే భావన కలిగేలా నిర్వాహకులు పరిస్థితులను కల్పించారంటూ బాంబు పేల్చారు. నిర్వాహకులు పేర్కొన్నట్లు ఈ పోటీలు బ్యూటీ విత్ పర్పస్‌కు అనుగుణంగా లేవని.. అదంతా డొల్లేనని దుయ్యబట్టారు. పోటీదారులంతా ఎల్లవేళలా మేకప్ వేసుకోవాలని ఆదేశించారని.. అల్పాహారం సమయంలోనూ బాల్ గౌన్లు ధరించాల్సిందేనని హుకుం జారీ చేశారని విమర్శించారు. 'పోటీకి ఆర్థిక సహకారం అందిస్తున్న స్పాన్సర్లకు కృతజ్ఞతాపూర్వకంగా ఆరుగురు అతిథులు కూర్చున్న ఒక్కో టేబుల్ వద్ద ఇద్దరేసి పోటీదారులను కూర్చోబెట్టారు. సాయంత్రం మొత్తం వారితో కూర్చొని కృతజ్ఞతలు తెలుపుతూ మేం వినోదం అందించాలని నిర్వాహకులు ఆశించారు. ఓ సమయంలో పోటీల ఉద్దేశం గురించి అతిథులకు వివరించే ప్రయత్నం చేశా. కానీ ఈ విషయాన్ని వారెవరూ పట్టించుకోలేదు. అది నాకు భరించలేనట్లుగా అనిపించింది. ఇతరుల వినోదం కోసం నేను ఇక్కడికి రాలేదు కదా అనుకున్నా. సంపన్న పురుష స్పాన్సర్ల ముందు కవాతు చేశాక వేశ్యలా భావించా'అని మిల్లా మాగీ చెప్పుకొచ్చింది. తరువాయి 2లో




# దేశంలో మరో రెండు కొత్త కరోనా వేరియంట్స్



ఈ కబురు : భారత్ లో కరోనా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. రోజురోజుకీ కరోనా పాజిటివ్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, యూపీ, వెస్ట్ బెంగాల్ లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. తాజాగా ఒక రోజు తేడాతో ఏపీ, తెలంగాణలో కూడా కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఇదిలా ఉంటే దేశంలో రెండు కొత్త కరోనా వేరియంట్లు ఉన్నట్లు గుర్తించారు. ఎన్బీ 1.8.1(NB 1.8.1), ఎల్ఎఫ్.7(LF.7) లను గుర్తించినట్టు సార్స్-కోవ్ జీనోమిక్స్ కన్సార్టియం(INSACOG) శనివారం ప్రకటించింది. NB.1.8.1 వేరియంట్ ఒక కేసు తమిళనాడులో, LF.7 వేరియంట్ నాలుగు కేసులు గుజరాత్‌లో నమోదయ్యాయి.

తరువాయి 2లో

» 2లో

# మెట్రో విస్తరణకు సాయం చేయండి

*నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని నరేంద్రమోదీతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు.*



# హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రవేశాలు.. ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకున్న న్యాయమూర్తి



**ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు చెక్‌పడింది.**

ఈ కబురు,అమెరికా: ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు చెక్‌పడింది. హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతి ట్రంప్ రద్దు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకుంటూ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

» 3లో

# పాలిసెట్‌లో 88.5% ఉత్తీర్ణత

టాప్ ర్యాంకుల్లో బాలికలదే పైచేయి

*ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర పాలిసెట్‌లో 83,364 (88.54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విభాగంలో 81.88%, ఎంబైపీసీ విభాగంలో 84.33% అర్హత సాధించారు. టాప్ ర్యాంకుల్లో ఎక్కువ మంది బాలికలే ఉండటం విశేషం.*



» 2లో


# విచారణ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు
# కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై మంత్రి ఉత్తమ్

*ఈ కబురు,హుజూర్‌నగర్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ విచారణ కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రీడిజైన్ చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయాంలోనే కూలిపోయిందన్నారు.*

అప్పట్లోనే కూలిపోయినా నోరు మెదపని ఆ నాయకులు విచారణ కమిషన్ నోటీసులిచ్చే సరికి రకరకాలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని తన నివాసంలో ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో తుమ్మిడి హెట్టి వద్ద డిజైన్ చేసిన అంబేద్కర్ చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో పూర్తయ్యేదని, అది పూర్తి అయితే కాంగ్రెస్‌కు ఎక్కడ మంచి పేరు వస్తదో అని రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్‌వారు కట్టలేదని దుయ్యబట్టారు.



తరువాయి 3లో



# తిరువనంతపురం కోవలం బీచ్ వద్ద పర్యాటకుల సందడి

**అంచనా కంటే మూడు రోజుల ముందే రాక**
**ప్రస్తుతం చురుకుగా కదులుతున్న రుతుపవనాలు**
**3 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశం!**
**నేడు, రేపు కొన్నిచోట్ల వర్షా లు**

ఈ కబురు, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. శనివారం ఉదయం కేరళ భూభాగంలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది

» 3లో



# రేవంత్ రాజీనామా చేయాల్సిందే.. బీజేపీ నేతలెందుకు స్పందించరు: కేటీఆర్

*అంతర్గత విషయాలు.. అంతర్గతంగా మాట్లాడితేనే మంచిది*
*ఆ దెయ్యాన్ని వదిలించాలన్నదే బీఆర్ఎస్ ప్రయత్నం*

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్‌రెడ్డి అని, రాష్ట్రానికి పట్టిన శని కాంగ్రెస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ దెయ్యాన్ని, శనిని వదిలించాలన్నదే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. 'కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దెయ్యాలు'ఉన్నాయంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ ఈమేరకు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'అంతర్గత విషయాలను ప్రస్తావించేందుకు పార్టీ వేదికలు ఉంటాయి. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంటుంది. ఆఫీసు బేరర్స్‌ను కలిసి చెప్పుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి కొన్ని విషయాలను అంతర్గతంగా మాట్లాడితేనే బాగుటుంది. ఈ సూత్రం వాళ్లకు వీళ్లకు కాదు.. పార్టీలో ఉన్న కార్యకర్తలందరికీ వర్తిస్తుంది. ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన బీఆర్ఎస్‌లో అధ్యక్షుడు కేసీఆర్‌కు లిఖితపూర్వకంగా లేదా మౌఖికంగా సూచనలిస్తూ ఎవరైనా లేఖలు రాయొచ్చు. అయితే పార్టీలో ఏ హోదాలో ఉన్న వారైనా కొన్ని అంతర్గత విషయాలను అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటుంది'అని కేటీఆర్ అన్నారు. 'లోక్‌సభ ఎన్నికలకు ముందు మేము పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమీక్ష పెట్టి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో ఎలా ముందుకు పోవాలని వేల మంది కార్యకర్తలతో గంటలకొద్దీ చర్చించాం. ఆ క్రమంలో చాలామంది నేరుగా మైక్‌లో మాట్లాడారు.

తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

## పోటీల నుంచి వైదొలగిన మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ?

ఈనెల ప్రారంభంలో మిస్ ఇంగ్లాండ్ మాగీ.. తన తల్లి, కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి సంబంధించి అత్యవసర పరిస్థితి కారణంగా ఈ పోటీల నుంచి విరమించుకోవాలని సంస్థను కోరినట్టు తెలిపారు. మిల్లా పరిస్థితి అర్థం చేసుకొని, వెంటనే స్పందించి ఆమె కుటుంబ సభ్యుల క్షేమం ప్రథమ ప్రాధాన్యతగా పరిగణించామన్నారు. తక్షణమే ఆమెను ఇంగ్లాండ్‌కు తిరిగి పంపే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మిల్లా.. మిస్ వరల్డ్ పోటీల నుంచి వైదొలిగిన తర్వాత మిస్ ఇంగ్లాండ్ మొదటి రన్నరప్ మిస్ షార్లెట్ గ్రాంట్ ఇంగ్లాండ్ తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకొచ్చారని వెల్లడించారు. మిస్ షార్లెట్ బుధవారం ఇండియాకు చేరుకున్నారని, మిస్ వరల్డ్ సోదరభావంతో ఆమెను పోటీల్లో పాల్గొనేందుకు అనుమతించినట్టు చెప్పారు. ఆమె ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. బ్రిటిష్ మీడియాలో ప్రచారంలో ఉన్న కథనాలు, కొన్ని యూకే మీడియా సంస్థలు మిల్లా మాగీ పోటీల్లో ఎదుర్కొన్న అనుభవాలపై తప్పుడు కథనాలు ప్రచురించాయని, అవి పూర్తిగా నిరాధారమైనవని తోసిపుచ్చారు. మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ సమయంలో మిస్ మిల్లా మాగీ స్వయంగా వ్యక్తపరిచిన భావాలు, ఎడిట్ చేయని వీడియో క్లిప్‌లు మిస్ వరల్డ్ సంస్థ విడుదల చేసింది. అందులో ఆమె ఆనందం, కృతజ్ఞత, ఈ అనుభవం మెచ్చుకుంటూ మాట్లాడిన దృశ్యాలు కూడా ఉన్నాయని మోర్లే చెప్పారు.

మారాలనుకున్నా... నా వల్ల కాలేదు.. సమాజంలో మార్పు తీసుకురావడానికి, యువతలో స్ఫూర్తినింపి వారి భవితకు దోహదపడాలనే ఉద్దేశంతోనే పోటీలో పాల్గొన్నానని మిల్లా మాగీ పేర్కొంది. కానీ అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితుల్లో ఉంటానని ఏమాత్రం ఊహించలేకపోయానని చెప్పుకొచ్చింది. అతిథులను సంతోషపెట్టేందుకు ఆటాడే కోతుల్లా అక్కడ కూర్చోవాల్సి వచ్చిందని.. దీన్ని ఏమాత్రం తట్టుకోలేకపోయానని వాపోయింది. 'నేను నిర్వాహకుల నిబంధనలకు అనుగుణంగా మారాలనే ప్రయత్నంలో ఒత్తిడిని అనుభవించా. అలా చేయకపోతే గెలవలేననే విషయం నాకు అర్థమైంది. మిస్ వరల్డ్ పోటీలంటే మనం ఎలా ఉన్నామో అలా కనిపించడం. కానీ 1970ల నుంచి ఆ పోటీల తీరు మారలేదు. అందుకే మేకప్ లేకుండానే బయటకు వెళ్లడం ప్రారంభించా. అల్పాహారం తీసుకోవడానికి నాకు నప్పేవి, తగిన దుస్తులను ధరించడం ప్రారంభించా'అని మిల్లా మాగీ చెప్పింది.

ఆరోపణలన్నీ నిరాధారం: మిస్ వరల్డ్ సీఈఓ మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ఆరోపణలను మిస్ వరల్డ్-2025 సీఈఓ జూలియా మోర్లే ఓ ప్రకటనలో ఖండించారు. ఆమె ఆరోపణలను నిరాధార, కల్పితమైనవిగా అభివర్ణించారు. తల్లి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నందున పోటీల నుంచి వైదొలగుతానని మిల్లా మాగీ చెప్పడంతో ఆమె స్వదేశం చేరుకొనేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మాగీ స్థానంలో మిస్ ఇంగ్లాండ్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన చార్లెట్ గ్రాంట్ పోటీలో పాల్గొనేందుకు హైదరాబాద్ చేరుకుందని.. ఈ పోటీలో ఇంగ్లండ్ ప్రాతినిధ్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. మిల్లా మాగీ ఆరోపణల నేపథ్యంలో పోటీలో పాల్గొన్న సందర్భంగా ఆమె నిర్వాహకులను ప్రశంసిస్తూ మాట్లాడిన మాటలు, అనుభూతులను పంచుకున్న వైనాన్ని వీడియోలను విడుదల చేయనున్నట్లు జూలియా మోర్లే వివరించారు. మిస్ వరల్డ్ సంస్థ అంకిత భావంతో ఉందని.. బ్యూటీ విత్ పర్పస్ అనే పంథాకు కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.



మొదటి పేజీ తరువాయి

# మనమంతా టీమిండియా








కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం: సీఎంలు

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలని తమిళనాడు, పంజాబ్ ముఖ్యమంత్రులు ఎం.కె.స్టాలిన్, భగవంత్ మాన్ డిమాండ్ చేశారు. "రాష్ట్రాలకు 41 శాతం వాటా ఇస్తామని మాటిచ్చారు. కానీ 33.16 శాతమే ఇస్తున్నారు. తమిళనాడు దేశంలోకెల్లా అత్యంత పట్టణీకరణ చెందిన రాష్ట్రం. అమృత్ 2.0 పథకం కింద రాష్ట్రానికి ప్రత్యేక పట్టణీకరణ మిషన్‌ను మంజూరు చేయాలని ఎప్పటినుంచో కోరుతున్నాం. నమామి గంగ తరహాలో తమిళనాడులోని కావేరీ, వైగై తదితర నదుల ప్రక్షాళనకు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయాలి" అని స్టాలిన్ కోరారు. ఆ ప్రాజెక్టులకు పేర్లను ఇంగ్లిష్లోనే పెట్టాలన్నారు. పంజాబ్‌లో పాకిస్తాన్‌ను ఆనుకుని ఉండే ఆరు సరిహద్దు జిల్లాలకు ప్రత్యేక పారిశ్రామిక ప్యాకేజీ అందించాలని కేంద్రానికి మాన్ విజ్ఞప్తి చేశారు. సరిహద్దు ప్రాంతాల రైతులకు ఇస్తున్న ఎకరాకు రూ.10 వేల పరిహారాన్ని రూ.30 వేలకు పెంచాలన్నారు. సిక్కిం, పశ్చిమబెంగాల్‌లోని సిలిగురిలను కలుపుతూ ప్రపంచస్థాయి జాతీయ రహదారి నిర్మించాల్సిన అవసరం చాలా ఉందని సిక్కిం సీఎం ప్రేంసింగ్ తమాంగ్ అన్నారు.

### విధాన అడ్డంకులు తొలగించాలన్నారు: సీఈఓ

భేటీ వివరాలను నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం మీడియాకు వెల్లడించారు. "వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై మరింతగా దృష్టి సారించాలని రాష్ట్రాలకు ప్రధాని సూచించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించాలని, తద్వారా ఇతోధికంగా ఉపాధి అవకాశాలను సృష్టించాలని, అందుకోసం విధానపరమైన అడ్డంకులను తొలగించుకోవాలని హితవు పలికారు" అని చెప్పారు. భేటీలో పాల్గొన్న సీఎంలు, నేతలు ఆపరేషన్ సిందూర్‌ను ముక్తకంఠంతో సమర్థించారన్నారు.

### జైరాంతో కాంగ్రెస్‌కే చేటు: బీజేపీ

నీతి ఆయోగ్ ఓ 'అయోగ్య' (అసమర్థ) సంస్థ అన్న కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్‌కే చేటు చేసే వివాదాలను సృష్టించడం ఆయన నైజమని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్‌ను జైరాం భూస్థాపితం చేయడం ఖాయమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ జోస్యం చెప్పారు.నవ్వుల్ పువ్వుల్ ఆయోగ్ భేటీలో సరదా సన్నివేశాలు ప్రధాని, ముఖ్యమంత్రుల నడుమ పలు సరదా సన్నివేశాలకు నీతి ఆయోగ్ భేటీ వేదికైంది. సమావేశం ముగిశాక రేవంత్‌రెడ్డి, స్టాలిన్ తదితరులతో మోదీ సరదా సంభాషణలు జరిపారు. నవ్వుతూ, వారిని నవ్విస్తూ కనిపించారు. భగవంత్ మాన్ (పంజాబ్), హేమంత్ సోరెన్ (జార్ఖండ్), కొన్రాడ్ సంగ్మా (నాగాలాండ్) తదితరులు మోదీతో చాలాసేపటిదాకా కరచాలనం చేస్తూ కన్పించారు. వారితో ప్రధాని సరదాగా మాట్లాడారు. ఈ సందర్భంగా నేతలంతా తేనీరు సేవిస్తూ ఉల్లాసంగా గడిపారు. యువత నైపుణ్యాభివృద్ధికి బాటలు యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేశాం. ప్రపంచ స్థాయి క్రీడాకారుల తయారీ ధ్యేయంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేస్తున్న స్పోర్ట్స్ హబ్‌లో 12 ప్రత్యేక క్రీడా అకాడమీలు క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందిస్తాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మద్దతుగా 'రాజీవ్ గాంధీ సివిల్ సర్వీసెస్ అభయహస్తం' ప్రారంభించాం. వెనుకబడినవర్గాల యువతకు స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించేందుకు 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభించాం. ఏడాదిలో 60 వేల ఉద్యోగాల భర్తీ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క సంవత్సరంలోనే 60 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. ప్రైవేట్ రంగంలో మరో లక్షకు పైగా ఉద్యోగాలు వచ్చాయి. భవిష్యత్తు అవసరాలను తీర్చేలా శ్రామికశక్తి రూపకల్పనకు బలమైన వ్యవస్థను నిర్మిస్తున్నాం. అలాగే యువతీయువకులను పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా, నాయకులుగా తీర్చిదిద్దుతున్నాం. వ్యవసాయంపై చేసే వ్యయాన్ని సంక్షేమకోణంలో కాకుండా ఆహార సంపద సృష్టికి పెట్టుబడిగా చూడాలి. అందుకే మేం 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేయడానికి రూ.20,616 కోట్లను వెచ్చించాం. రైతుభరోసా కింద ప్రతి రైతుకు ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నాం. సన్న ధాన్యం రైతులకు క్వింటాకు రూ.500 ఇస్తున్నాం. 2024 వర్షాకాలంలో 1.53 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తితో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది మొత్తంగా 2.90 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశానికి ఆదర్శంగా నిలిచాం. రైతు బీమాను అమలుచేస్తున్నాం. గిరిజన రైతుల కోసం ఇందిర సౌర గిరిజల వికాస పథకాన్ని ప్రారంభించాం. జాతీయ విధానాలపై తెలంగాణ ప్రభావం కచ్చితమైన డేటా సేకరణ.. సమ్మిళిత విధానాల రూపకల్పన, సామాజిక న్యాయానికి పునాదిగా ఎలా ఉపయోగపడుతుందో చూపడం ద్వారా తెలంగాణ దేశానికి నమూనాగా నిలిచింది. మేం అనుసరించిన ఉత్తమ ప్రయత్నాలు జాతీయస్థాయిలో ప్రభావం చూపాయి. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలనే నిర్ణయానికి తెలంగాణ శాసనసభ తీర్మానం ప్రేరణనివ్వడం మాకు గర్వకారణం ఈ మేరకు హైదరాబాద్‌నాగ్‌పుర్, హైదరాబాద్‌వరంగల్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌విజయవాడ పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేస్తున్నాం. జహీరాబాద్‌లో రూ.15 వేల కోట్లతో స్మార్ట్ పారిశ్రామిక సిటీ అభివృద్ధి జరుగుతోంది. అందులో 2లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. కొడంగల్‌లో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తున్నాం. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ భారతదేశంలో మొట్టమొదటి సమగ్ర జౌళి హబ్. ఇది రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు లక్ష ఉద్యోగాలను సృష్టిస్తుందని భావిస్తున్నాం. మహేశ్వరం, రావిర్యాలలో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లు... రూ.5 వేల కోట్ల పెట్టుబడులను రాబట్టి 5,600 మందికి ఉపాధిని కల్పించాయి. లిథియంఅయాన్ బ్యాటరీల తయారీకి రూ.9,580 కోట్ల పెట్టుబడితో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో 370 ఎకరాల్లో న్యూ ఎనర్జీ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. భారత సెమీకండక్టర్ మిషన్‌లో హైదరాబాద్‌ను చేర్చాలని కేంద్రానికి విన్నవిస్తున్నాం. రూ.15 లక్షల మందికి నివాసం, 7.5 లక్షల మందికి ఉపాధిని కల్పించేలా భారత్ ఫ్యూచర్ సిటీ... దార్శనిక స్మార్ట్ పారిశ్రామిక హబ్‌గా రూపొందుతోంది. ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. రానున్న ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 25 వేలపైచిలుకు కొత్త యూనిట్ల స్థాపనకు రూ.4 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నాం. ప్రతి జిల్లాలో పారిశ్రామిక పార్కులను, ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కర్మాగారాల సముదాయాలను అభివృద్ధి చేస్తున్నాం. మహిళల నేతృత్వంలోని సంస్థలు, ఆవిష్కరణఆధారిత స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నాం" అని వివరించారు. సదస్సులో ప్రధాని మోదీ... సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వచ్చి కరచాలనంతో పలకరించారు. ఇతర సీఎంలతోనూ మోదీ మాట్లాడారు.

మొదటి పేజీ తరువాయి

## పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రాష్ట్ర ఈఎన్సీ లేఖ



**ఈ కబురు: పోలవరం నుంచి ఎత్తిపోతలు చేపట్టకుండా చూడాలని ఏపీ గోదావరి బోర్డు, పోలవరం ప్రాజెక్టుకు అథారిటీకి తెలంగాణ ఈఎన్సీ లేఖ రాశారు. పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోసేందుకు ఏపీ సిద్ధమైన నేపథ్యంలో ఈ లేఖను రాసింది. తెలంగాణ ప్రాజెక్టులకు నీటి లభ్యత లేదని అభ్యంతరం చెబుతున్న ఆంధ్రప్రదేశ్.. తెలంగాణ ప్రాజెక్టులకు అభ్యంతరం చెబుతూ ఏపీ చేపట్టడమేంటని ప్రశ్నించారు. పోలవరం నుంచి ఏపీ ఎత్తిపోతల చేపట్టడం తగదన్నారు. డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల సీడబ్ల్యూసీ అనుమతులకు విరుద్ధం అని వాదన వినిపించారు. తక్షణమే జోక్యం చేసుకుని ఏపీని నిలువరించాలని కోరింది. గోదావరి డెల్టా అవసరాలకు నష్టం జరుగుతుందని పేర్కొంది.**

మొదటి పేజీ తరువాయి

## పాలిసెట్‌లో 88.5% ఉత్తీర్ణత

**ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్ర పాలిసెట్‌లో 83,364 (88.54 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విభాగంలో 81.88%, ఎంబైపీసీ విభాగంలో 84.33% అర్హత సాధించారు. టాప్ ర్యాంకుల్లో ఎక్కువ మంది బాలికలే ఉండటం విశేషం. 120 మార్కుల పేపర్‌లో నలుగురు విద్యార్థులు పూర్తి మార్కులు 120 సాధించటం గమనార్హం. పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి సాంకేతిక విద్య, శిక్షణ మండలి ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా పాలిసెట్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష ఫలితాలను సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన శనివారం విడుదల చేశారు. పరీక్షకు మొత్తం 1,06,716 మంది దరఖాస్తు చేయగా, 98,858 మంది పరీక్ష రాశారు. వీరిలో 83,364 మంది అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో మొత్తం 80,949 మంది అర్హత సాధించగా, వారిలో బాలురు 41,923 మంది, బాలికలు 39,026 మంది ఉన్నారు. ఎంబైపీసీ విభాగంలో బాలురు 42,836, బాలికలు 40,528 మంది కలిపి మొత్తంగా 83,364 మంది అర్హత సాధించారు. మొత్తం 120 మార్కులకు నిర్వహించిన పరీక్షలో అర్హత మార్కులు 36. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు ఒక్క మార్కు వచ్చినా అర్హతగా పరిగణిస్తారు. పాలిసెట్ ర్యాంకు కార్డులను ఎస్‌బీటీఈటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని దేవసేన తెలిపారు. ప్రవేశ ప్రకటన వెలువడిన తర్వాత విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరవ్వాలని ఆమె సూచించారు.**

**లక్ష్యంతో చదివా**

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచి పాలిసెట్‌లో ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో చదివాను. ఎస్సెస్సీలో 574 మార్కులు సాధించాను. ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులు నాకు ఎక్కువ ఇష్టం. భవిష్యత్‌లో ఐఐటీలో మంచి సీటు సాధించి, ఇంజనీర్ కావాలన్న లక్ష్యంతో చదువుతున్నాను. ర్యాంకు సాధించేందుకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. – ఉంద్యాల కౌశిక్‌నారాయణ, 1వ ర్యాంకర్**

**సివిల్స్ సాధించడమే లక్ష్యం**

**కోదాడ: భవిష్యత్తులో సివిల్స్ సాధించడమే నా లక్ష్యం. ఐఐటీలో ఇంజనీరింగ్ చదువుతా. తరువాత సివిల్స్‌పై దృష్టి సారిస్తా. టీజీఎస్ఆర్‌జేసీలో కూడా నాలుగో ర్యాంకు సాధించాను. పాఠశాల యాజమాన్యం, నా తండ్రి జానీపాషా ప్రోత్సాహంతో ఈ ర్యాంకులు సాధించాను. – ఎస్.కె. ఇఫ్రా తస్నీమ్, 3వ ర్యాంకర్**

# మెట్రో విస్తరణకు సాయం చేయండి



**హైదరాబాద్‌లో మెట్రోరైలు మార్గం రెండో దశ నిర్మాణానికి సాయం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాని నరేంద్రమోదీని కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలకు ఒకేసారి ఆర్థిక శాఖ, మంత్రిమండలి**

ఈ కబురు,న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో మెట్రోరైలు మార్గం రెండో దశ నిర్మాణానికి సాయం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాని నరేంద్రమోదీని కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలకు ఒకేసారి ఆర్థిక శాఖ, మంత్రిమండలి అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్‌కి సమాంతరంగా గ్రీన్‌ఫీల్డ్ రైల్వేలైన్ నిర్మాణానికి సహకరించాలన్నారు. హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేసే డ్రైపోర్ట్‌ను మచిలీపట్నం పోర్టుకు అనుసంధానించేందుకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. శనివారం దిల్లీలో ప్రధానిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై మోదీకి వినతిపత్రం సమర్పించారు. మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి సీఎం రేవంత్ ప్రధాని మోదీకి వివరించినట్లు తెలిసింది. "నగరంలో ప్రస్తుతం మొదటి దశలో మూడు కారిడార్లలో 69 కి.మీ. మేర మెట్రో రైలు నిర్మాణానికి రూ.22,000 కోట్ల ఖర్చు అయింది. రెండో దశలో నగరంలోని ఇతర ప్రాంతాలకు మెట్రోను విస్తరించాలి. గత ప్రభుత్వం ఎలాంటి విస్తరణ చేపట్టలేదు. గత నవంబరు 4న కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు మా ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించింది. వాటిపై కేంద్రం కొన్ని వివరణలు కోరగా.. సమాధానాలు ఇచ్చాం. రెండో దశలో 76.4 కి.మీ. విస్తరణలో 5 కారిడార్లు ఉంటాయి. దీనికి మొత్తం ఖర్చు రూ.24,269 కోట్లు. ఇందులో కేంద్రం వాటా రూ.4,230 కోట్లు... రాష్ట్రం వాటా రూ.7,313 కోట్లు. అలాగే రుణంగా రూ.11,693 కోట్లు అవసరం. 2021లో బెంగళూరు ఫేజ్ 2 మెట్రోను రూ.14,788 కోట్లతో, 2024లో ఫేజ్ 3 మెట్రోను రూ.15,611 కోట్లతో, 2024లో చెన్నై రెండో దశ మెట్రోను రూ.63,246 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ మెట్రోకు కూడా కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేయాలి. ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ వృద్ధితో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పుడున్న ఓఆర్ఆర్ రానున్న ఐదేళ్లలో సరిపోదు. హైదరాబాద్ చుట్టూ రెండు జాతీయ రహదారులతో ఆర్ఆర్ఆర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఉత్తర భాగానికి అవసరమైన భూముల సేకరణ 2022లో ప్రారంభమైంది. భూసేకరణ వ్యయంలో రాష్ట్రం 50% భరిస్తోంది. 90% భూముల ప్రతిపాదనలు జాతీయ రహదారుల సంస్థకు పంపాం. రోడ్డు నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ టెండర్లు పిలిచింది. ఈ భాగానికి అవసరమైన ఆర్థిక మద్దతుతో పాటు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలపాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పూర్తయిన తర్వాత దక్షిణ భాగం నిర్మాణం చేపడితే భూ సేకరణ, నిర్మాణ వ్యయం భారీగా పెరిగే ప్రమాదముంది. అందువల్ల రెండు భాగాలను ఏకకాలంలో చేపట్టాలి. ఒకేసారి పూర్తి చేస్తేనే సరైన ఉపయోగం ఉంటుంది. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం భూసేకరణకు అయ్యే వ్యయంలో 50% భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రీజినల్ రింగ్ రోడ్‌కు సమాంతరంగా 370 కిమీ పరిధిలో రైల్వే లైన్ ప్రతిపాదించాం. ఇది రాష్ట్రాభివృద్ధికి కొత్త దిశలో మార్గం చూపుతుంది.

దేశంలో 35 శాతం ఔషధాలను తెలంగాణ ఉత్పత్తి చేస్తోంది. బందరు పోర్టు నుంచి హైదరాబాద్ డ్రైపోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు చేయాలి. డ్రైపోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవే సరకు రవాణా ఖర్చు తగ్గించడంతో పాటు ఎగుమతులకు దన్నుగా నిలుస్తుంది. ఈ మార్గం తయారీ రంగానికి ప్రోత్సాహకంగా ఉండడంతో పాటు నూతన ఉద్యోగాలను సృష్టిస్తుంది. సెమీ కండక్టర్ రంగానికి మద్దతు ఇవ్వండి.. కేంద్రం చేపట్టిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్‌కు తెలంగాణ పూర్తి మద్దతు ఇస్తోంది. తెలంగాణ ఐఎస్ఎం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతించాలి. అది పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కలిగించి ఉద్యోగాలు సృష్టిస్తుంది. 2030 నాటికి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిలో 500 బిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యానికి తోడ్పడుతుంది. హైదరాబాద్‌లో ఏఎండీ, క్వాల్కమ్, ఎన్‌విడియా వంటి పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఉన్నాయి. పరిశ్రమలకు స్థలాలు, నైపుణ్యం గల మానవ వనరులు, మౌలిక సదుపాయాలు హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయి. రక్షణ రంగ పరికరాల తయారీలో ముందున్న హైదరాబాద్‌లో డిఫెన్స్ ఎక్స్‌పో నిర్వహించాలి. తమిళనాడు, యూపీ, ఏపీ మాదిరి తెలంగాణకు కేంద్రం సహకరించాలి. ఆయా రాష్ట్రాలకు సమానంగా మద్దతు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ప్రభుత్వ, ప్రభుత్వప్రైవేటు సంయుక్త భాగస్వామ్యంలో, ఎంఎస్ఎంఈల్లో ఉన్న రక్షణ రంగ ప్రాజెక్టులకు ఊతమివ్వాలి. హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో, డిఫెన్స్ పీఎస్‌యూలు ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నాయి. వాటి పరిధిలో వెయ్యికి పైగా ఎంఎస్ఎంఈలు స్థానిక, అంతర్జాతీయ డిఫెన్స్ సంస్థలకు విడిభాగాలు తయారు చేస్తున్నాయి. లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, జీఈ, శాఫ్రన్, హనీవెల్ వంటి సంస్థలు హైదరాబాద్‌పై ఆసక్తి చూపుతున్నాయి. రక్షణ రంగంలోని జేవీలకు తక్షణం కేంద్ర ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలి. దీనికి ఆమోదం తెలిపేందుకు ప్రత్యేక వ్యవస్థను అనుమతించాలి" అని రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కోరారు.

# దేశంలో మరో రెండు కొత్త కరోనా వేరియంట్స్

ఈ కబురు : భారత్ లో కరోనా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. రోజురోజుకీ కరోనా పాజిటివ్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, యూపీ, వెస్ట్ బెంగాల్ లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉంది. తాజాగా ఒక రోజు తేడాతో ఏపీ, తెలంగాణలో కూడా కరోనా కేసులు నమోదు అయ్యాయి. ఇదిలా ఉంటే దేశంలో రెండు కొత్త కరోనా వేరియంట్లు ఉన్నట్లు గుర్తించారు. ఎన్బీ 1.8.1(NB 1.8.1), ఎల్ఎఫ్.7(LF.7) లను గుర్తించినట్టు సార్స్‌కోవ్ జీనోమిక్స్ కన్సార్టియం(INSACOG) శనివారం ప్రకటించింది. NB.1.8.1 వేరియంట్ ఒక కేసు తమిళనాడులో, LF.7 వేరియంట్ నాలుగు కేసులు గుజరాత్‌లో నమోదయ్యాయి.ఈ వేరియంట్లు ఒమిక్రాన్ నుంచి పరిణామం చెందిన రకాలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థపేర్కొంది. కొత్త వేరియంట్లు చైనా, హాంకాంగ్, సింగాపూర్, థాయ్ లాండ్ లలో వేలల్లో కేసులు నమోదు కావడానికి కారణం అవుతున్నాయి. ప్రకారం ఇవి తక్కువ ప్రమాదకరమైనవి అయినప్పటికీ అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఇక దేశంలో ఇప్పటి వరకు 290 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. రోజురోజుకీ అన్ని రాష్ట్రాల్లో కొత్త కేసులు మొదలవుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కరోనా నియమాలు విడుదల చేస్తూ.. జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.



మొదటి పేజీ తరువాయి

# రేవంత్ రాజీనామా చేయాల్సిందే.. బీజేపీ నేతలెందుకు స్పందించరు: కేటీఆర్

మరికొందరు కేసీఆర్‌కు ఇవ్వమంటూ లేఖలు ఇచ్చారు. మా పార్టీలో బహిరంగ చర్చను ప్రోత్సహిస్తాం. ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన మా పార్టీ అధ్యక్షుడికి ఎవరైనా సూచనలు చేయొచ్చు, ఉత్తరాలు రాయొచ్చు'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అన్ని పార్టీల్లో ఉన్నట్లు బీఆర్ఎస్‌లోనూ రేవంత్ కోవర్టులు ఉండొచ్చని, సరైన సమయంలో వారంతటే వారు బయటపడతారన్నారు. ఓటుకు నోటు కేసులో 'బ్యాగ్‌మ్యాన్' 'యంగ్ ఇండియా నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్‌లో చేర్చడం రాష్ట్రానికి అవమానకరం. ఈ కేసులో రేవంత్ పేరు వచ్చిందన్న వార్తను కొన్ని పత్రికలు అసలు రాయనే లేదు. మీడియా ఎంత తాపత్రయపడ్డా.. ఎన్ని ప్రకటనలు తీసుకున్నా రేవంత్ ఒక లొట్ట పీసు ముఖ్యమంత్రి అని ప్రజలకు అర్థమైపోయింది. మీడియా ఎన్ని దాచినా సోషల్ మీడియాతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తూనే ఉంటాయి ఓటుకు నోటు కేసులో బ్యాగ్‌మ్యాన్ అని పేరు తెచ్చుకున్న రేవంత్ వైఖరి మారలేదని ఈడీ ఛార్జ్ షీట్లో బయటపడింది. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారగా, ఢిల్లీ కాంగ్రెస్‌కు అవసరమైనప్పుడల్లా భారీ మొత్తంలో ఇస్తూ రేవంత్ తన పదవి కాపాడుకుంటున్నాడు. నైతికత ఉంటే రేవంత్ సీఎం పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలి లేదా కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ఆయనను పదవి నుంచి తప్పించాలి. ప్రధాని మోదీ, అమిత్ షాతో ఒప్పందం కుదుర్చుకునేందుకే రేవంత్ ఢిల్లీ వెళ్లారు. 17 నెలల్లో 44 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ కేసుల నుంచి తప్పించాలని చీకట్లో అమిత్ షా కాళ్లు పట్టుకుంటున్నాడు. రేవంత్‌కు రాహుల్ గాంధీ అధికారిక బాస్ కాగా, మోదీ, అమిత్ షా అనధికార బాస్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఏడాదిన్నరగా బీఆర్ఎస్‌పై నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, ఢిల్లీ బాస్‌లకు రూ.వేలకోట్ల చందాలు అనే రీతిలో రేవంత్ పాలన సాగుతోంది. రేవంత్ అవినీతిపై రాహుల్ మాట్లాడాలి. ఈడీ ఛార్జ్ షీట్లో సోనియా, రాహుల్ పేర్లు ఉన్నా జపాన్ టూర్ పేరిట రేవంత్ స్పందించకుండా తప్పుకున్నాడు'అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నడుమ అపురూప బంధం 'నేషనల్ హెరాల్డ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్ విషయంలో తెలంగాణ బీజేపీ నేతలు మౌన మునుల్లా మారిపోయారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు చేస్తున్న భూదందా అక్రమాలకు రేవంత్ వత్తాసు పలుకుతున్నందుకే మౌనమా'అని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.187 కోట్ల వాల్మీకి స్కామ్, ట్రిపుల్ ఆర్ టాక్స్, హెచ్‌సీయూ భూముల్లో అక్రమాలు, పౌర సరఫరాల కుంభకోణం జరుగుతున్నా కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదు. రేవంత్‌కు రక్షణ కవచంలా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం స్పందించకుంటే నెల రోజుల తర్వాత మా కార్యాచరణ ప్రకటిస్తాం. ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్‌ను కోరతాం'అని చెప్పారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, రాజయ్య పాల్గొన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు బట్టబయలైంది. నీతి, నిజాయితీ ఉంటే రేవంత్ సీఎం పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. హస్తిన పెద్దల కాళ్లు పట్టుకోవడానికే రేవంత్ ఢిల్లీకి వెళ్తున్నారు. బీజేపీ నాయకత్వం కాంగ్రెస్ నేతలను కాపాడుతోందని సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..'ఓటుకు నోటు కుంభకోణం ఇంకా ఎవరూ మర్చిపోలేదు. ఢిల్లీ కాంగ్రెస్ నేతలకు తెలంగాణ ఏటీఎంలా మారిపోయింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు డబ్బులు పంపిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. పీసీసీ పదవి కోసం రేవంత్ రూ.50 లక్షలు ఇచ్చారని కాంగ్రెస్ నేతలే ఆరోపణలు చేశారు. ఇప్పుడు సీటుకు రూట్ కుంభకోణం బయటపడింది. రేవంత్ రెడ్డి వైఖరితో దేశవ్యాప్తంగా తెలంగాణ పరువు పోయింది. నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు బట్టబయలైంది. రేవంత్ రెడ్డితో రాజీనామా చేయించి నిష్పక్షపాతంగా విచారణ చేయించాలి. రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నారో అర్థమవుతోంది. హస్తిన పెద్దల కాళ్లు పట్టుకోవడానికే రేవంత్ ఢిల్లీకి వెళ్తున్నారు. ఢిల్లీ బాసులకు రేవంత్ రెడ్డి వేల కోట్లు చందాలు ఇస్తున్నారు. లీడర్లు, కాంట్రాక్టర్లతో రేవంత్ దందాలు చేశారు. రేవంత్ జపాన్ పర్యటనపై మాకు అప్పుడే సందేహాలు వచ్చాయి. యంగ్ ఇండియా పేరుతో దందా చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో భారీ వసూళ్లను పాల్పడ్డారు. రేవంత్ రెడ్డి వ్యవహారంలో రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదు. నీతి, నిజాయితీ ఉంటే రేవంత్ సీఎం పదవి నుంచి తప్పుకోవాలి. లేకుంటే కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి కుర్చీ నుంచి రేవంత్‌ను తప్పించాలి. మంత్రి పొంగులేటిపై ఈడీ దాడులు చేస్తే ఇప్పటి వరకూ బీజేపీ నేతలు స్పందించలేదు. వాల్మీకి స్కాంపై నోరు మెదపరు. సివిల్ సప్లయ్ స్కాంపై ఎలాంటి చర్యలు లేవు. బీజేపీకి నిజాయితీ ఉంటే ఈ స్కాంలపై స్పందించాలి. తెలంగాణలో ఎవరు ఎవరితో కుమ్మక్కు అవుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి. గవర్నర్‌ని కలిసి సీఎం అవినీతిపై చర్యలకు డిమాండ్ చేస్తాం. నెల రోజుల్లో చర్యలు తీసుకోకుంటే మా పార్టీ కార్యచరణ తీసుకుంటాం అని హెచ్చరించారు. యడ్యూరప్పపై విమర్శలు వస్తే రిజైన్ చేయాలని కర్ణాటక కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయలేదా?. కాంగ్రెస్ అంటేనే కరప్షన్ అని అందరికీ తెలుసు. డీకే శివకుమార్‌ను తొలగించాలని కర్ణాటకలో బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కానీ, తెలంగాణలో మాత్రం బీజేపీ నేతలకు ఏమైంది?. హెరాల్డ్ కేసుపై రేవంత్ ఎందుకు స్పందించలేదు?. బీజేపీ నాయకత్వం కాంగ్రెస్ నేతలను కాపాడుతోంది. బీజేపీ నేతలకు దమ్ముంటే రేవంత్ వ్యవహారంపై వెంటనే స్పందించాలి' అని డిమాండ్ చేశారు.



మొదటి పేజీ తరువాయి

# గచ్చిబౌలి డివిజన్ లో రూ.6.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన





అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

**పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లో 6 కోట్ల 74 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం తెలంగాణ పిఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ నుంచి హిమ సాయి టవర్స్ వరకు 1కోటి 85 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్ లైన నిర్మాణ పనులకు, రంగారెడ్డి టీఎన్జీవోస్ కాలనీ ఫేజ్ 1 & 2లో 4 కోట్ల 89 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజి పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి భారీ ఎత్తున నిధులు తీసుకువచ్చి పనులు చేపడుతున్నామని అన్నారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ కాలనీలను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. సమస్యలను ఒక్కొకటిగా అధిగమిస్తూ శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ఆదర్శవంతమైన గచ్చిబౌలి డివిజన్ ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతీ బస్తీ, కాలనీల్లో కోట్ల నిధులు వెచ్చించి మంచినీరు,భూగర్భ డ్రైనేజి పైప్ లైన్, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం నరేందర్ రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, జిహెచ్ఎంసి అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# విచారణ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు

## కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి



అప్పట్లోనే కూలిపోయినా నోరు మెదపని ఆ నాయకులు విచారణ కమిషన్ నోటీసులిచ్చే సరికి రకరకాలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని తన నివాసంలో ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో తుమ్మిడి హెట్టి వద్ద డిజైన్ చేసిన అంబేడ్కర్ చేవెళ్ల -ప్రాణహిత ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో పూర్తయ్యేదని, అది పూర్తి అయితే కాంగ్రెస్‌కు ఎక్కడ మంచి పేరు వస్తదో అని రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్‌వారు కట్టలేదని దుయ్యబట్టారు. రూ.38 కోట్లతో అయ్యేదానిని అదే ఆయకట్టుకు రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారన్నారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ఒక చిన్న లిఫ్ట్ గ్రావిటీ ద్వారా వచ్చే నీళ్లను కాదని వాళ్లు తలపెట్టిన మూడు పెద్ద లిఫ్ట్‌లను కట్టడంతో ఏటా రూ.10 వేల కోట్లు కరెంటు బిల్లు వస్తోందన్నారు. ఆ పెద్ద మనిషి విమానంలో ప్రయాణిస్తూ ఇక్కడ ప్రాజెక్టు కట్టు, ఇక్కడ కాలవలు తీయ్ అని ప్రణాళికలు చేయడం వల్లనే మేడిగడ్డ కూలిపోయిందంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు.

మొదటి పేజీ తరువాయి

# ఛత్తీస్‌గఢ్ కవలలకు పునర్జన్మనిచ్చిన కిమ్స్ కడల్స్



ఎయిర్ అంబులెన్స్ లో చిన్నారులను తరలిస్తున్న దృశ్యం



కోలుకున్న కవలలతో ఆసుపత్రి డాక్టర్లు, తల్లిదండ్రులు

- నెలలు నిండకముందే పుట్టిన అబ్బాయిలు
- ఇద్దరినీ ఎయిర్ లిఫ్ట్ చేసి నగరానికి తరలింపు
- నెల రోజుల చికిత్సతో కోలుకున్న చిన్నారులు

ఈకబురు, శేరిలింగంపల్లి : '' ఆ ఇద్దరు కవల పిల్లలు ఎక్కడో ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో పుట్టారు. నెలలు నిండకముందే పుట్టిన వారిద్దరిలో ఓ బాలుడు 1.4 కిలోల బరువు, మరో బాలుడు 1.5 కిలోల బరువు మాత్రమే ఉన్నారు. దానికితోడు ఇద్దరికీ విపరీతమైన ఇన్ఫెక్షన్ల కారణంగా ప్రాణాపాయ స్థితి ఏర్పడింది. దీంతో అక్కడి డాక్టర్ల సూచన మేరకు ఇద్దరు చిన్నారులను కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రత్యేక విమానంలో ఎయిర్ అంబులెన్స్ ద్వారా హైదరాబాద్ కు తరలించారు. నగరంలోని కొండాపూర్ కిమ్స్ కడల్స్ డాక్టర్లు ప్రత్యేక చికిత్సను అందించి చిన్నారుల ఆరోగ్యాన్ని సాధారణ స్థితికి తీసుకువచ్చారు.''

మెడికల్ హబ్ గా మారిన నగరంలో డాక్టర్లు మరో అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. తెలుగు రాష్ట్రాలోనే మొదటి సారిగా నెలలు నిండకుండా పుట్టిన ఇద్దరు కవల పిల్లలను ఎయిర్ అంబులెన్స్ ద్వారా రాష్ట్రాలను దాటించి, నగరానికి తీసుకువచ్చి విజయవంతంగా చికిత్సను అందించారు. తక్కువ బరువుతో, విషమించిన అనారోగ్యంతో వచ్చిన చిన్నారులు నేడు పూర్తి ఆరోగ్యంతో కొలుకున్నారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రం బిలాస్ పూర్ లో గత నెల రోజుల క్రితం ఓ మహిళ ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. నెలలు నిండకుండా పుట్టిన ఈ కవల సోదరులు బరువు తక్కువగా, తీవ్ర అనారోగ్యంతో ఉండడం, ప్రాణాపాయ స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు రోజుల వయస్సు ఉన్న చిన్నారులను ఎయిర్ అంబులెన్స్ ద్వారా నగరానికి తరలించారు. నగరంలోని కొండాపూర్ గల కిమ్స్ కెడల్స్ లో చేర్చగా, ఆసుపత్రి డాక్టర్లు నెల రోజుల చికిత్స అందించి చిన్నారులను కాపాడారు. ప్రస్తుతం ఇద్దరు చిన్నారులు పూర్తి ఆరోగ్యంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

**పూర్తి ఆరోగ్యంతో కవల సోదరులు : డాక్టర్ అపర్ణ. సీ**

ఈ మేరకు కిమ్స్ కెడల్స్ నియోనాటాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్, ఎన్ఐసీయూ అధిపతి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అపర్ణ.సి ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. అక్కడి నుంచి తీసుకొచ్చే సమయంలోనే ఓ చిన్నారి పరిస్థితి విషమించిందని, రక్తంలో ఫంగల్ ఇన్ఫెక్షన్‌తో పాటు డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ కారణంగా శరీరంలో కీలక అవయవాలన్నీ పనిచేయడం మానేశాయన్నారు. దీనితో ప్రత్యేక చికిత్సను అత్యంత జాగ్రత్తగా అందించామని అన్నారు. రెండో బాబుకు ఫంగల్ సెప్సిస్ కావడంతో ముక్కు ద్వారా సీపీఏపీ ఇవ్వాల్సి వచ్చిందని, పిల్లలిద్దరికీ ప్లేట్‌లెట్ కౌంట్ బాగా పడిపోవడంతో పలుమార్లు రక్తం, ప్లేట్‌లెట్లు ఎక్కించినట్టు తెలిపారు. నెల రోజుల పాటు పలు రకాల చికిత్సల తర్వాత పిల్లలిద్దరికీ ఇన్ఫెక్షన్లు పూర్తిగా తగ్గాయని, తల్లిపాలు తాగగలుగుతున్నారని తెలిపారు. కవల సోదరులు ప్రస్తుతం సుమారు 2వేల గ్రాముల బరువుకు చేరుకున్నారని అన్నారు. ఇక వారి భవిష్యత్తుకు ఢోకా లేదని, రెండు తెలుగు రాష్ట్రాల్లో కవలల పిల్లల్ని మొదటిసారిగా ప్రత్యేక విమానంలో తీసుకురావడం ఇదే మొదటిసారి అని అన్నారు. చిన్నారులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసి వారి సొంత ఊరికి పంపిస్తున్నట్లు తెలిపారు. కిమ్స్ కడల్స్ ఆస్పత్రి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలోని ఐసీఏటీటీ బృందం, డాక్టర్లు వంశీ, అరవింద, ప్రణీత , సునీత నేతృత్వంలోని డాక్టర్లు, సిబ్బంది చిన్నారుల చికిత్సలో పాలుపంచుకున్నారని అన్నారు.

# హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రవేశాలు..

## ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకున్న న్యాయమూర్తి






ఈ కబురు,అమెరికా: ప్రతిష్టాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు చెక్‌పడింది. హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతి ట్రంప్ రద్దు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకుంటూ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి నిధుల్లో కోత వేసిన ట్రంప్ అడ్మినిస్ట్రేషన్.. ఏకంగా విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని గురువారం రద్దు చేసింది. దీంతో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ యూనివర్సిటీ కోర్టుకెక్కింది. ఈ మేరకు బోస్టన్ ఫెడరల్ కోర్టులో యూనివర్సిటీ పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన న్యాయమూర్తి అలిసన్ బరోస్ అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తాత్కాలికంగా అడ్డుకున్నారు.

తమ విద్యాసంస్థలో ప్రవేశం పొందిన అంతర్జాతీయ విద్యార్థులు వీసా పొందేందుకు అవసరమైన పత్రాల జారీకి స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ కింద విశ్వవిద్యాలయాలకు అనుమతి లభిస్తుంది. యూనివర్సిటీలు ఇచ్చిన సర్టిఫికేషన్‌తో విద్యార్థులు వీసాకు దరఖాస్తు చేసుకుంటారు. ఎస్ఈవీపీ వ్యవస్థ నుంచి విశ్వవిద్యాలయాన్ని తొలగించడం అనైతికమని, నిబంధనలు ఉల్లంఘించడం అవతుందని హార్వర్డ్ తన తాజా పిటిషన్‌లో పేర్కొంది. ''ఒక్క సంతకంతో యూనివర్సిటీలోని మొత్తం విద్యార్థుల్లో పావువంతు వారిని తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది'' హార్వర్డ్ పేర్కొంది. 140కి పైగా దేశాల్లోని విద్యార్థులు హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుతున్నారు. ప్రస్తుతం ఉన్న, త్వరలో రాబోయే విదేశీ విద్యార్థుల సంఖ్య సుమారు 7,000 మంది. ఈ మొత్తం సంఖ్య యూనివర్సిటీలో చదువుతున్న వారిలో 27 శాతానికి సమానం.

హార్వర్డ్ పాలన, పాఠ్యాంశాలు, సిబ్బంది, విద్యార్థుల భావజాలంను నియంత్రించాలనే ప్రభుత్వ డిమాండ్లను తిరస్కరించడానికి యూనివర్సిటీ తన మొదటి సవరణ హక్కులు ఉపయోగించుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రతీకార చర్యలకు దిగిందని హార్వర్డ్ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వ చర్యతో అనేక అకాడమిక్ ప్రోగ్రామ్‌లు, పరిశోధన ప్రయోగశాలలు, క్లినిక్‌లు, యూనివర్సిటీ తరఫున ఎఫ్1, జే1 వీసాదారుల కోర్సులు ఒక్కసారిగా గందరగోళానికి గురైనట్లు తెలిపింది. తమకు వెంటనే ప్రభుత్వ చర్యల నుంచి ఉపశమనం కలిగించాలని హార్వర్డ్ తాజా పిటిషన్‌లో కోరింది.



మొదటి పేజీ తరువాయి

# తిరువనంతపురం కోవలం బీచ్ వద్ద పర్యాటకుల సందడి



ఈ కబురు, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. శనివారం ఉదయం కేరళ భూభాగంలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు అత్యంత చురుకుగా ఉన్నాయని, లక్షదీవులతో పాటు కేరళ రాష్ట్రంలోకి పూర్తిగా ప్రవేశించేందుకు అత్యంత తక్కువ సమయం పడుతుందని వివరించింది. మరోవైపు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను కూడా రుతుపవనాలు తాకాయి. నైరుతి రుతుపవనాలు ముందుగా కేరళ రాష్ట్రంలోకి ప్రవేశించిన తర్వాత దేశమంతటా విస్తరిస్తాయి. ఈ సీజన్‌లో రుతుపవనాలు వాతావరణ శాఖ అంచనాల కంటే మూడురోజులు ముందుగానే భారత ప్రధాన భూభాగాన్ని తాకటం విశేషం. గతేడాది నైరుతి రుతుపవనాలు మే 30న కేరళను తాకగా... ఈసారి ఆరు రోజుల ముందే ప్రవేశించాయి.

రానున్న రెండురోజుల్లో రుతుపవనాలు మధ్య అరేబియన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, గోవాలో పూర్తి భూభాగం, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలతోపాటు సబ్ హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఈసారి వర్షాకాలంలో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది.

మూడురోజుల్లో రాష్ట్రంలోకి..

రానున్న మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణంగా కేరళను తాకిన తర్వాత సగటున నాలుగు నుంచి ఆరు రోజుల మధ్య తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండడంతో మూడు రోజులలోపే రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలోకి ప్రవేశించిన తర్వాత రాష్ట్రమంతటా రుతుపవనాలు విస్తరించేందుకు మరో మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గతేడాది జూన్ 3వ తేదీన రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశించగా... ఈసారి మే నెలలోనే ప్రవేశించడం గమనార్హం.

27న బంగాళాఖాతంలో అల్పపీడనం

నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండడం రైతాంగంలో ఉత్సాహాన్ని నింపుతోంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల సీజన్‌లో కురిసే వర్షాలు బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం, వాయుగుండం, తుఫానులపైనే ఆధారపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆరోజుకల్లా తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో ఈ అల్పపీడనం ప్రభావం రాష్ట్రంపై ఉంటుందని, చాలాచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అల్పపీడనం రెండ్రోజుల్లో బలపడి తీవ్ర అల్పపీడనంగా మారుతుందని ముందస్తు అంచనాలు వెల్లడించాయి.

రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కొంకణ్ - గోవా తీర ప్రాంతం సమీపంలో కొనసాగిన స్పష్టమైన అల్పపీడన ప్రాంతం శనివారం ఉదయం బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం అదే ప్రాంతంలో రత్నగిరికి ఆగ్నేయంగా 40 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉంది.

EPFO

# ఈపీఎఫ్ వడ్డీ రేటు ఖరారు చేసిన కేంద్రం


**ఈపీఎఫ్ నిల్వలపై వడ్డీ రేటును కేంద్రం ఖరారు చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతంగా నోటిఫై చేసింది.**

**దిల్లీ:** ఈపీఎఫ్ నిల్వలపై వడ్డీ రేటును కేంద్రం ఖరారు చేసింది. 202425 ఆర్థిక సంవత్సరానికి 8.25 శాతంగా నోటిఫై చేసింది. ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ ) సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ కొన్ని రోజుల క్రితం ప్రతిపాదించిన వడ్డీ రేటును యథాతథంగా కేంద్రం ఆమోదించింది. 202324 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే వడ్డీని చెల్లించిన సంగతి తెలిసిందే. కేంద్రం వడ్డీని నోటిఫై చేసిన నేపథ్యంలో త్వరలో 7 కోట్ల మంది చందాదారుల ఖాతాల్లో వడ్డీ జమ కానుంది.

**బ్యాలెన్స్ చెక్ ఇలా..**

పీఎఫ్ వడ్డీ మీ అకౌంట్‌లో జమ అయ్యిందో లేదో చెక్ చేసుకోవడంతో పాటు ఖాతాలో నిల్వల వివరాల కోసం ఉమాంగ్ యాప్‌ను సందర్శించొచ్చు. రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయ్యాక యాప్‌లో ఈపీఎఫ్ఓ సర్వీసెస్ విభాగంలోకి వెళితే యూఏఎన్, ఓటీపీ ఎంటర్ చేయాలి. ఆపై బ్యాలెన్స్, పాస్‌బుక్ వంటి వివరాలు కనిపిస్తాయి. ఈపీఎఫ్ఓ పోర్టల్ www.epfindia.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి యూఏఎన్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. తర్వాత మెంబర్ పాస్‌బుక్‌ను ఎంపిక చేసుకుని వివరాలు పొందొచ్చు. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి 99660 44425 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా కూడా పీఎఫ్ బ్యాలెన్స్ వివరాలు తెలుసుకోవచ్చు. ఈ నంబర్‌కు కాల్ చేయగానే ఆటోమేటిక్‌గా కాల్ డిస్కనెక్ట్ అవుతుంది. కాసేపటి తర్వాత పీఎఫ్ బ్యాలెన్స్ ఎస్సెమ్మెస్ రూపంలో వస్తుంది. ఎస్సెమ్మెస్ రూపంలో ఈ వివరాలు పొందాలంటే యూఏఎన్‌తో లింక్ అయిన మొబైల్ నుంచి 77382 99899 నంబర్‌కు ఈపీఎఫ్ఓ 'యూఏఎన్' అని మెసేజ్ చేయడం ద్వారా కూడా పీఎఫ్ బ్యాలెన్స్ పొందొచ్చు.

# 'ఎక్స్' సేవల్లో అంతరాయం.. యాప్, వెబ్‌సైట్లో సమస్య



**ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీనిపై యూజర్లు అసహనం వ్యక్తంచేస్తున్నారు.**

ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. సాయంత్రం 6 గంటల నుంచి ఈ సమస్య ప్రారంభమైనట్లు డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. ఎక్స్ వెబ్‌సైట్, యాప్‌లో కొత్త పోస్టుల కోసం రీఫ్రెష్ చేసినప్పుడు 'సమ్‌థింగ్ వెంట్ రాంగ్, ట్రై రీలోడింగ్' అని సందేశం చూపిస్తోంది. శుక్రవారం సైతం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. శుక్రవారం నాటి అంతరాయంపై ఎక్స్ ఇంజినీర్లు అధికారికంగా వివరణ ఇచ్చారు. డేటా సెంటర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య మూలంగా ఈ పరిస్థితి నెలకొందని వివరించారు. ఈ కారణంగా కొందరు యూజర్లకు లాగిన్, సైనప్ సేవల్లో అవాంతరాలు ఏర్పడొచ్చని పేర్కొన్నారు. నోటిఫికేషన్లు, ప్రీమియం ఫీచర్లలో కొంత ఆలస్యం జరగొచ్చని తెలిపారు. నేడు కూడా ఇదే తరహా సమస్య తలెత్తడంపై ఎక్స్ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. వరుసగా రెండో రోజూ ఇదే పరిస్థితి నెలకొనడంతో యూజర్లు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

## త్వరలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు..

# ₹800కే అపరిమిత డేటా!



శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. తుది అనుమతుల కోసం కంపెనీలు వేచి చూస్తున్నాయి. దేశంలో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్‌తో పాటు ఇతర కంపెనీలు ఈ సేవలను ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నాయి. అయితే, తొలి దశలో యూజర్లను ఆకట్టుకునేందుకు తక్కువ ధరలోనే డేటా సేవలను ఆయా కంపెనీలు అందించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. నెలకు 10 డాలర్ల కంటే తక్కువ అంటే రూ.840లోపే ఈ ప్లాన్ ధరలు ఉండొచ్చని చెబుతున్నారు. ఆ ధరకే అపరిమిత డేటా అందించే అవకాశం ఉందని 'ఎకనామిక్ టైమ్స్' పేర్కొంది. తొలుత ఆయా కంపెనీలు తమ యూజర్ బేస్‌ను పెంచుకోవడంపై దృష్టిసారించే అవకాశం ఉంది. 10 మిలియన్ కస్టమర్లను చేరుకోవడం ద్వారా స్పెక్ట్రమ్ కాస్ట్‌ను భర్తీ చేసుకోవడం సాధ్యమవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించి ఒక్కో అర్బన్ యూజర్ నుంచి రూ.500 చొప్పున ఫీజు వసూలుచేయాలని ట్రాయ్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సాధారణ సర్వీసులతో పోలిస్తే ఈ మొత్తం చాలా అధికం. దీనికితోడు సర్దుబాటు చేసిన స్థూల ఆదాయంలో 4 శాతం లెవీగా చెల్లించాలని ట్రాయ్ పేర్కొంది. MHz స్పెక్ట్రానికి ఏడాదికి కనీసం రూ.3500 వార్షిక ఫీజును ట్రాయ్ ప్రతిపాదించింది. దీనికి ఇంకా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించాల్సి ఉంది. ఈ స్థాయిలో లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రమ్ ఛార్జీలు ఉన్నప్పటికీ వినియోగదారులను పెంచుకునేందుకు తక్కువ ధరకే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు దేశీయంగా సర్వీసులు ప్రారంభించడానికి స్టార్ లింక్‌కు టెలికాం విభాగం నుంచి అనుమతులు లభించాయి. ఇంకా ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్) ఆమోదం తెలపాల్సి ఉంది. స్టార్‌లింక్‌తో పాటు యూటెల్సాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ కూడా డాట్ నుంచి అనుమతులు పొందినా ఇన్‌స్పేస్ నుంచి తుది అనుమతుల కోసం వేచి చూస్తున్నాయి. ఈ అనుమతులు లభిస్తే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు త్వరలోనే పౌరులకు అందుబాటులోకి రానున్నాయి.




# ఐపీఓ క్యాలెండర్: 9 సబ్‌స్క్రిప్షన్లు, 4 లిస్టింగ్‌లు

**వచ్చే వారంలో నిధుల సమీకరణ కోసం 9 సంస్థలు పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. 4 కంపెనీలు స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.**

స్టాక్ మార్కెట్లో ఐపీఓల సందడి కొనసాగుతోంది. వచ్చే వారంలోనూ పెద్ద సంఖ్యలో ఐపీఓలు మార్కెట్ నుంచి నిధులు సేకరించేందుకు రానున్నాయి. మెయిన్ బోర్డ్, ఎస్ఎంఈ విభాగం నుంచి ఐపీఓలు క్యూ కడుతున్నాయి. వీటితో పాటు ఇప్పటికే సబ్‌స్క్రిప్షన్ పూర్తి చేసుకున్న సంస్థలు మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాయి.

**ఏజిస్ వొపాక్ టెర్మినల్**

మెయిన్ బోర్డు నుంచి ఏజిస్ వొపాక్ టెర్మినల్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ మే 26న ప్రారంభమై 28న ముగియనుంది. మార్కెట్ నుంచి రూ.2,800 కోట్ల నిధుల్ని సమీకరించాలని కంపెనీ చూస్తోంది. ఈ ప్రక్రియ మొత్తం తాజా షేర్ల జారీ ద్వారా నిర్వహించనున్నారు. ధరల శ్రేణి రూ.223 235గా నిర్ణయించారు. రిటైల్ మదుపర్లు కనీసం ఒక్క లాట్ (63 షేర్లు) కోసం రూ.14,805 వెచ్చించాలి.

**స్కూలాస్ బెంగళూరు లిమిటెడ్**

లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ మాతృసంస్థ స్కూలాస్ బెంగళూరు లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు ధరల శ్రేణి రూ.413 435గా నిర్ణయించారు. సబ్‌స్క్రిప్షన్ ఈనెల 26న మొదలై 28న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.3,500 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

**స్కోడా ట్యూబ్స్**

రూ.220 కోట్లు సమీకరించాలనే లక్ష్యంతో స్కోడా ట్యూబ్స్ ఐపీఓకు వస్తోంది. ఈ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ మే 28న ప్రారంభమై 30న ముగుస్తుంది. ధరల శ్రేణి రూ.130 140గా ఉంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి ఆఫర్ ఫర్ సేల్ ద్వారా నిర్వహించనున్నారు. రిటైల్ మదుపర్లు కనీసం ఒక్క లాట్ (100 షేర్లు) కోసం రూ.14,000 వెచ్చించాలి.

**ప్రొస్ట్రామ్ ఇన్ఫో సిస్టమ్స్**

ప్రధాన బోర్డు నుంచి వస్తున్న మరో ఐపీఓ ప్రొస్ట్రామ్ ఇన్ఫో సిస్టమ్స్. ధరల శ్రేణి రూ.95 105గా కంపెనీ నిర్ణయించింది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ 27న మొదలై 29న ముగియనుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.168 కోట్లను కంపెనీ సమీకరించే అవకాశం ఉంది.

**బ్లూ వాటర్ లాజిస్టిక్స్**

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సేవల సంస్థ, బ్లూ వాటర్ లాజిస్టిక్స్ ఎస్ఎంఈ విభాగం నుంచి ఐపీఓకు వస్తోంది. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.40.50 కోట్లు సమీకరించనుంది. ఫ్రైట్ ఫార్వార్డింగ్, కస్టమ్ క్లియరెన్స్, ట్రాన్స్‌పోర్టేషన్ హ్యాండ్లింగ్ సర్వీసులను ఈ సంస్థ అందిస్తోంది. ధరల శ్రేణి రూ.132 135గా నిర్ణయించారు. సబ్‌స్క్రిప్షన్ మే 27న ప్రారంభమై 29న ముగుస్తుంది.



**ఇవి కూడా..** ఎస్ఎంఈ విభాగం నుంచి విక్టరీ ఎలక్ట్రిక్ వెహికల్, నెప్ట్యూన్ పెట్రోకెమికల్, నికితా పేపర్స్, ఆస్టోనియా ల్యాబ్స్ ఐపీఓల సబ్‌స్క్రిప్షన్ కూడా వచ్చే వారంలోనే ప్రారంభమవుతుంది.

**ఇక లిస్టింగ్ విషయానికొస్తే..**

బొరోనా వేవ్స్ (మే 28న), దార్ క్రెడిట్ అండ్ క్యాపిటల్ (మే 28న), బెలిస్ ఇండస్ట్రీస్ (మే 29న), యూనిఫైడ్ డేటా టెక్ (మే 29న) షేర్లు లిస్ట్ కానున్నాయి.




# ఎల్ఐసీ గిన్నిస్ ఫీట్..

## 24 గంటల్లో రికార్డు స్థాయిలో పాలసీల విక్రయం

**ఎల్ఐసీ అరుదైన ఫీట్ సాధించింది. 24 గంటల్లో రికార్డు స్థాయిలో పాలసీలు విక్రయించి సరికొత్త రికార్డు నెలకొల్పింది.**

ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ ) అరుదైన ఘనతను సాధించింది. 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలు విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు ఎల్ఐసీ ఓ ప్రకటనలో తెలిపింది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరును గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గుర్తించిందని ఎల్ఐసీ పేర్కొంది. దేశవ్యాప్తంగా 4,52,839 మంది ఏజెంట్లు ఈ ఏడాది జనవరి 20న 5,88,107 లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను జారీ చేసినట్లు ఎల్ఐసీ తెలిపింది. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలు జారీ చేయడం ఇదే తొలిసారి. తమ ఏజెంట్లు తమదైన పనితీరుతో ఒక బెంచ్‌మార్క్‌ను సృష్టించారని ఎల్ఐసీ పేర్కొంది. ఇది తమ ఏజెంట్ల అవిశ్రాంత కృషి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడింది. ఎల్ఐసీ కస్టమర్లు, వారి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించాలనే లక్ష్యానికి నిబద్ధతగా నిలుస్తోందని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం అయిన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకుని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్క పాలసీ అయినా పూర్తి చేయాలన్న ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను ఎల్ఐసీ సొంతం చేసుకుంది. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.





# కేన్స్‌లో అడుగుపెట్టిన అలియా.. ఫొటోలు షేర్ చేసిన నటి


కేన్స్ వేడుకకు అలియా హాజరయ్యారు. తన లుక్‌కు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకున్నారు. బాలీవుడ్ నటి అలియా భట్ కేన్స్ వేదికపై హొయలొలికించారు. తొలిసారి ఈ వేడుకలకు హాజరైన అలియా.. తన లుక్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచారు. సింపుల్ ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన ఫ్లోరల్ గౌన్‌తో నాజూగ్గా కనిపించారు. కేన్స్ రెడ్ కార్పెట్‌పై అరంగేట్రం చేయడానికి ముందు తన లుక్ ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు. 'హలో కేన్స్' అంటూ క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఆ పిక్స్ వైరల్ అవుతున్నాయి. ఈ అంతర్జాతీయ వేదికపై మెరిసిన తారల జాబితాలో అలియా చేరడం ఆనందంగా ఉందంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

మే 13 నుంచి 24 వరకూ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. తొలిరోజు అలియా వెళ్తారని అందరూ భావించారు. అయితే భారత్ - పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆమె తన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. దీంతో అసలు ఆమె హాజరవుతారా, లేదా అని అనుకున్నారు. ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇస్తూ వేడుక ముగిసే సమయానికి వేదికపై మెరిశారు అలియా.*









# జూన్ 6న 'గ్యాంబ్లర్స్'.. పోస్టర్ విడుదల చేసిన టీమ్




సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. జూన్ 6న ఈ సినిమా విడుదల కానుంది.

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు సొంతం చేసుకున్నారు హీరో సంగీత్ శోభన్. ఈ హీరో ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'గ్యాంబ్లర్స్' . చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమా జూన్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం ఓ ఆసక్తికర పోస్టర్‌ను పంచుకుంది.

ఇందులో సంగీత్ శోభన్ సరసన ప్రశాంతి చారులింగ కథానాయికగా నటించారు. రాకింగ్ రాకేశ్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత కీలక పాత్రల్లో నటించారు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దీన్ని నిర్మించారు. నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్న ఈ సినిమా జూన్ 6న రానున్నట్లు తెలుపుతూ చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. ఇదొక మిస్టరీ ఎంటర్‌టైనర్ అని.. ఇందులోని థ్రిల్లింగ్ అంశాలు, ట్విస్ట్‌లు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఇది ఆకట్టుకుంటుందన్నారు.

# మీకు కనీస కృతజ్ఞత లేదు.. సినిమా వాళ్లెవరూ వ్యక్తిగతంగా రావద్దు: డిప్యూటీ సీఎం పవన్

**గత ప్రభుత్వం సినిమా రంగంవారిని, అగ్ర నటులను ఎలా ఛీత్కరించిందో మరిచిపోయారని, కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుందని పవన్‌కల్యాణ్ అన్నారు.**

**అమరావతి:** తెలుగు చిత్రసీమలో ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం పట్ల కనీస కృతజ్ఞత లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా తెలుగు సినీ సంఘాల ప్రతినిధులు రాష్ట్రముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సినిమా రంగంవారిని, అగ్ర నటులను ఎలా ఛీత్కరించిందో మరిచిపోయారని, కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుందని అన్నారు. మీరు ఇచ్చిన ఈ రిటర్న్ గిఫ్ట్‌ను తగిన విధంగానే స్వీకరిస్తానని అన్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ డిమాండ్‌లు నెరవేర్చాలని లేకపోతే, జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు బంద్ అంటూ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన సమావేశం తర్వాత అలాంటిదేమీ లేదని ప్రకటించిన నేపథ్యంలో పవన్‌కల్యాణ్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు మర్చిపోయారా?**


"ఆంధ్రప్రదేశ్‌లో సినిమా పరిశ్రమను అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా, ఒక్కసారైనా గౌరవ సీఎం చంద్రబాబును కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం ఒక్కసారి కూడా రాలేదు. 'అందరూ కలిసి రావాలి' అని పిలుపునిచ్చినా సానుకూలంగా స్పందించలేదు. అగ్ర నటులు, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకుందో అందరూ మర్చిపోయారు. నాటి ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా"

**ఇక వ్యక్తిగతంగా రావద్దు**

"ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు' అని చెప్పాను. అయినా, ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది. మీరు ఇచ్చిన ఈ రిటర్న్ గిఫ్ట్‌ను తగిన విధంగానే స్వీకరిస్తా. ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తా. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తా" అని ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పరిశ్రమపై తన అభిప్రాయాన్ని ఘాటుగా ప్రకటన రూపంలో తెలియజేశారు.

**రాష్ట్రంలో థియేటర్లు, మల్టీప్లెక్స్‌లపై పవన్‌కల్యాణ్ ఆరా**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సినిమా థియేటర్ల నిర్వహణ, ప్రేక్షకులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో సంబంధిత శాఖలతో చర్చించారు. ప్రేక్షకుల నుంచి ప్రభుత్వానికి తరచూ వస్తున్న ఫిర్యాదుల్లో సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలు అత్యధికంగా ఉండటం, మంచి నీళ్ల సదుపాయం కూడా సక్రమంగా లేకపోవడం. వీటిపైనా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లో ఉన్న మల్టీప్లెక్స్‌ల నిర్వహణ వాటిలోని టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా దృష్టి సారించనున్నారు. సినిమా రూపకల్పన నుంచి వాణిజ్యం వరకూ 24 విభాగాల్లో నైపుణ్యాల పెంపుదల, అధునాతన సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్‌కల్యాణ్ యోచిస్తున్నారు.



# ఇట్స్ అఫీషియల్: ప్రభాస్ 'స్పిరిట్' హీరోయిన్ ఎవరంటే?

**ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న 'స్పిరిట్' మూవీలో కథానాయికగా త్రిప్తి డిమ్రీ ఎంపికైంది.**

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' . ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి కాగా, ఈ సినిమాకు సంబంధించి ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు దర్శకుడు సందీప్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇందులో నటించే కథానాయిక ఎవరా? అంటూ సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూశారు. పలువురు బాలీవుడ్ అగ్ర కథానాయికల పేర్లూ వినిపించాయి. అయితే, ఆ వార్తలకు చెక్ పెడుతూ ఇందులో కథానాయికగా నటించే అవకాశం త్రిప్తి డిమ్రీ దక్కించుకుంది. ఈ విషయాన్ని దర్శకుడు సందీప్ స్వయంగా ప్రకటించారు.

'స్పిరిట్' ప్రాజెక్ట్‌లో నటీనటులకు సంబంధించి ప్రభాస్ తర్వాత వచ్చిన అధికారిక ప్రకటన ఇదే. దాదాపు 9 భాషల్లో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు తాజా ప్రకటన చూస్తే అర్థమవుతోంది. త్రిప్తి డిమ్రీ పేరును తెలుగుతో పాటు, ఇంగ్లీష్, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, చైనీస్, జపనీస్, కొరియన్ భాషల్లో రాశారు. పాన్ వరల్డ్ మూవీగా 'స్పిరిట్'ను తీర్చిదిద్దనున్నట్లు ఈ ప్రకటన చూస్తే అర్థమవుతోంది. ఇక ఈ మూవీకి సంబంధించి ఇప్పటికే సంగీత చర్చలు కూడా మొదలయ్యాయి. హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరాలు సమకూరుస్తున్నారు. ప్రభాస్ తన కెరీర్‌లో తొలిసారి పోలీసు అధికారిగా నటించనున్నారు. చిత్రీకరణ కోసం మెక్సికోలో కొన్ని ప్రాంతాలు పరిశీలిస్తున్నామని, అక్కడే షూటింగ్ ప్రారంభిస్తామని దర్శకుడు సందీప్ ఇటీవల ఓ కార్యక్రమంలో తెలిపారు. ఇందులో ప్రతినాయకుడిగా దక్షిణ కొరియా స్టార్ నటుడు మా డాంగ్ సియోక్‌ను (Ma Dong-seok) తీసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు త్రిప్తి పేరును కొరియా భాషలోనూ రాయడంతో ఆ వార్తలకు బలం చేకూరుతోంది. ఏదేమైనా 'స్పిరిట్' టీమ్ అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే!

మరోవైపు ఈ సినిమాలో తనని ఎంపిక చేయడంపై త్రిప్తి ఆనందం వ్యక్తం చేసింది. "ఇప్పటికీ ఆనందంలోనే మునిగిపోయి ఉన్నా. ఈ ప్రయాణంలో నన్ను నమ్మినందుకు రుణపడి ఉంటా. మీ విజనరీ మేకింగ్‌లో భాగం అయినందుకు థాంక్యూ సందీప్‌రెడ్డి వంగా" అని పేర్కొంది. సందీప్‌రెడ్డి రూపొందించిన 'యానిమల్'లో త్రిప్తి కీలక పాత్ర పోషించింది. దానికి కొనసాగింపుగా రాబోయే 'యానిమల్ పార్క్'లోనూ ఈ బ్యూటీ సందడి చేయనుంది. వీటితో పాటు, ఇప్పటికే పలు బాలీవుడ్ సినిమాల్లో నటిస్తూ యువతను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# పవన్ కల్యాణ్ ప్రకటనపై స్పందించిన సినీ నిర్మాత బన్నీ వాసు




**పవన్ కల్యాణ్ ప్రకటనపై సినీ నిర్మాత బన్నీ వాసు 'ఎక్స్' వేదికగా స్పందించారు.**

**హైదరాబాద్:** తెలుగు చిత్రసీమలో ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం పట్ల కనీస కృతజ్ఞత లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా తెలుగు సినీ సంఘాల ప్రతినిధులు రాష్ట్రముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారా? అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ప్రకటనపై సినీ నిర్మాత బన్నీ వాసు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సినిమా ఇండస్ట్రీలో రాజకీయాలు చాలా సైలెంట్‌గా ఉంటాయి.. అలాగే చాలా లోతుగానూ ఉంటాయి. ఈ రాజకీయాల గొడవల్లో సినీ పరిశ్రమ నలిగిపోతోంది అనేది ఇప్పటికైనా సరే నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ గ్రహించాలి. సినిమా పరిశ్రమ నుంచి వెళ్లి డిప్యూటీ సీఎం అయిన వాళ్లనే మనం ఇరిటేట్ చేశామంటే.. మన మధ్య ఐక్యత ఎలా ఉందో ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది" అని బన్నీ వాసు ఎక్స్‌లో ట్వీట్ చేశారు. పెద్ద సమస్యలను పరిష్కరించడపై దృష్టి పెట్టాల్సిన సమయంలో అనవసర సమస్యలను సృష్టించారు. ఇప్పుడవే పెద్దవయ్యాయి. కామన్ సెన్స్‌తో ఆలోచించి ఉంటే ఇలాంటి సమస్యలు వచ్చి ఉండేవి కాదు.

# బాలీవుడ్‌లో విషాదం.. ప్రముఖ నటుడు కన్నుమూత

బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు ముకుల్ దేవ్(54) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. సీరియల్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ముకుల్ దేవ్ బాలీవుడ్ మూవీ 'దస్తక్'తో వెండితెరకి పరిచయం అయ్యాడు. హిందీతో పాటు తెలుగు, పంజాబీ, కన్న చిత్రాల్లోనూ నటించాడు. ముకుల్ దేవ్‌కి టాలీవుడ్‌లో కూడా మంచి గుర్తింపు ఉంది. తెలుగులో కృష్ణ, ఏక్ నిరంజన్, కేడీ, అదుర్స్, నిప్పు, భాయ్ తదితర సినిమాల్లో నటించాడు. కృష్ణ సినిమాలో పోషించిన విలన్ పాత్ర మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. 2022లో విడుదలైన 'అంత్ ది ఎండ్' తర్వాత ఆయన సినిమాల్లో కనిపించలేదు. 'సింహాద్రి', 'సీతయ్య', 'అతడు' చిత్రాల్లో నటించిన రాహుల్ దేవ్ సోదరుడే ముకుల్. తల్లిదండ్రుల మరణంతో ముకుల్ కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్నారు. ఈ క్రమంలో అనారోగ్యం పాలవ్వడంతో ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం పట్ల సినీ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు.





## బుమ్రా అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు: బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్

వర్క్‌లోడ్ కారణంగా జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లండ్‌తో జరగనున్న అన్ని టెస్టు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు టీమ్‌ఇండియా ఇంగ్లండ్ టూర్ ఐపీఎల్ ముగిసిన అనంతరం జూన్ 20న ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా భారత్ అయిదు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నేపథ్యంలో బుమ్రా అతడి ఫిట్‌నెస్ సమస్యలు, వర్క్‌లోడ్ కారణంగా అన్ని మ్యాచులూ ఆడలేడని బీసీసీఐ చీఫ్ కోచ్ అజిత్ అగార్కర్ తెలిపాడు. 'భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్‌తో జరగనున్న అన్ని మ్యాచ్‌లను ఆడగలిగే స్థితిలో లేడని ఫిజియోథెరపిస్టులు చెప్పారు. దీంతో అతడు కొన్ని మ్యాచ్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటాడు' అని అజిత్ అగార్కర్ అన్నాడు. అలాగే శుభ్‌మన్ గిల్‌కు టెస్టు జట్టు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం గురించి కూడా మాట్లాడాడు. 'మేం గత సంవత్సరం నుంచి శుభ్‌మన్ గిల్‌ను పరిశీలిస్తున్నాం. మా అంచనా ప్రకారం అతడు టీమ్‌ను అద్భుతంగా లీడ్ చేయగలడు. టీమ్‌ఇండియాకు కెప్టెన్ అంటే చాలా తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. అయినా వాటిని తట్టుకుని రాణిస్తాడనే నమ్మకం మాకుంది' అని అజిత్ అగార్కర్ మీడియాతో అన్నాడు. భారతజట్టులో స్థానం దక్కని మహ్మద్ షమీ విషయాన్ని కూడా ప్రస్తావించాడు. 'జట్టు అవసరాలు తీర్చగలిగేంత పూర్తి ఫిట్‌నెస్‌తో షమీ లేడు. ఇంగ్లండ్ టూర్‌కు అతడు అందుబాటులో ఉంటాడని మేం అనుకున్నాం. కానీ దురదృష్టవశాత్తు అలా జరగలేదు' అని అజిత్ అగార్కర్ ముగించాడు.





## పోతూ పోతూ పంజాబ్‌కు షాక్..

**విజయంతో సీజన్‌ను ముగించిన ఢిల్లీ ఐపీఎల్ 2025ని ఢిల్లీ క్యాపిటల్స్ విజయంతో ముగించింది. పంజాబ్ కింగ్స్‌పై వికెట్ల తేడాతో విజయం సాధించింది.**

**జైపూర్:** ఐపీఎల్ 2025ని ఢిల్లీ క్యాపిటల్స్ విజయంతో ముగించింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు దూరమైన ఢిల్లీ.. అగ్రస్థానంపై కన్నేసిన పంజాబ్ కింగ్స్ కు షాకిచ్చింది. జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్‌పై ఢిల్లీ వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ 4 వికెట్లు కోల్పోయి 3 బంతులు మిగిలుండగా ఛేదించింది.సమీర్ రిజ్వీ (58*; 25 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకంతో బాదాడు. కరుణ్ నాయర్ (44; 27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (35; 21 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), ఫాఫ్ డుప్లెసిస్ (23; 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించగా.. సెధిఖుల్లా అటల్ (22; 16 బంతుల్లో 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2, మార్కో యాన్సెన్, ప్రవీణ్ దూబె ఒక్కో వికెట్ తీశారు.
తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ భారీ స్కోరు చేసింది. ప్రియాంశ్ ఆర్య (6) నిరాశపర్చినా.. జోష్ ఇంగ్లిస్ (32; 12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (28; 18 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (53; 34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకం బాదగా.. చివర్లో స్టాయినిస్ (44*; 16 బంతుల్లో3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. నేహల్ వధేరా (16), శశాంక్ సింగ్ (11) పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్లలో ముస్తాఫిజుర్ 3, కుల్‌దీప్ యాదవ్ 2, విప్రాజ్ నిగమ్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టారు.



## ఇప్పుడు ఓడిపోయిందే ఉత్తమం: ఫిల్ సాల్ట్

ఎలిమినేటర్ మ్యాచ్‌లో పరాజయం పాలవడం కంటే... ఇప్పుడు ఓడిపోయిందే ఉత్తమం అని ఆర్సీబీ ఆటగాడు ఫిల్ సాల్ట్ అన్నాడు

ప్రస్తుత ఐపీఎల్‌లో భాగంగా శుక్రవారం ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓటమి చవిచూసింది. ఇప్పుడు పరాజయం పాలైందే మేలని మ్యాచ్ అనంతరం ఆర్సీబీ బ్యాటర్ ఫిల్‌సాల్ట్ అభిప్రాయపడ్డాడు. 'మేం ఇప్పటికే ప్లే-ఆఫ్స్‌నకు అర్హత సాధించాం. మ్యాచ్‌లో ఓడిపోవడానికి ఎవరూ ఇష్టపడరు. కానీ ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓటమి చవిచూడటం కంటే.. ఈ మ్యాచ్‌లో ఓడిపోవడమే ఉత్తమం' అని ఫిల్‌సాల్ట్.. మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో అన్నాడు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన 232 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్సీబీ 189 రన్స్‌కే ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ కారణంగా పాయింట్ల పట్టికలో దూసుకెళ్లే అవకాశాన్ని ఆర్సీబీ చేజార్చుకుంది. బెంగళూరు జట్టు ఇప్పటివరకు ఆడిన 13 మ్యాచుల్లో ఎనిమిదింట్లో విజయం సాధించింది. ప్రస్తుతం 17 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో ఉంది. లీగ్ దశలో ప్లేఆఫ్స్‌నకు ముందు ఆర్సీబీ తన చివరి మ్యాచ్‌ను మే 27న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తోఆడనుంది.

## టీమ్‌ఇండియా టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్





ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. కెప్టెన్‌గా గిల్‌కు బాధ్యతలు అప్పగించింది.


ముంబయి: భారత టెస్టు క్రికెట్‌లో కొత్త శకం ప్రారంభమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ శర్మ వారసుడిగా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. అందరూ భావించినట్లుగానే టెస్టు జట్టు కెప్టెన్సీ పగ్గాలను గిల్‌కు అప్పగించింది. ఈ మేరకు వచ్చే నెలలో ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్‌ఇండియా జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. సారథిగా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను తీసుకుంది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది.

కోహ్లీ స్థానంలో ఆ ఇద్దరిలో ఒకరు..సాయి సుదర్శన్, అర్‌ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌తోనే టెస్టుల్లో ఎంట్రీ ఇవ్వనున్నారు. ఇక, కరుణ్ నాయర్ 8 ఏళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో అడుగుపెడుతున్నాడు. చివరిసారిగా అతడు 2017 మార్చిలో టెస్టు మ్యాచ్ ఆడాడు. టెస్టు ఫార్మాట్‌కు కోహ్లీ రిటైర్మెంట్ ఇవ్వడంతో నంబరు 3లో ఎవరు వస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఆ స్థానంలో సాయి సుదర్శన్ లేదా కరుణ్ నాయర్‌ను తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి. గాయంతో బాధపడుతున్న షమీతో పాటు శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్‌కు జట్టులో చోటు దక్కలేదు.

**టీమ్ ఇండియా జట్టు ఇదే..**
**శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్‌ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్.**

## ఈ ఓటమి మంచిదే!: జితేశ్ శర్మ

**సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ ఓటమి పాలైంది. దీని గురించి ఆ జట్టు తాత్కాలిక కెప్టెన్ జితేశ్ శర్మ తన అభిప్రాయం వ్యక్తం చేశాడు.**



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా శుక్రవారం లఖ్‌నవూ వేదికగా ఆర్సీబీ , సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోరులో ఆర్సీబీ ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. దీనికి బదులుగా ఆర్సీబీ 19.5 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది. ఈ పరాజయం గురించి ఆర్సీబీ తాత్కాలిక కెప్టెన్ జితేశ్ శర్మ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. 'ఈ ఓటమి మంచిదే' అని ప్రస్తావించాడు. అయితే ఈ ప్రకటన అతన్ని ఇబ్బందుల్లో పడేసేలా ఉండడంతో, టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ రవిశాస్త్రి ఆ ప్రమాదం నుంచి జితేశ్‌ను రక్షించే ప్రయత్నం చేశాడు. 'నాకు తెలుసు ప్లేఆఫ్స్‌నకు ముందు ఈ ఓటమి ఓ మేలుకొలుపు. లోపాలు సరిదిద్దుకొని, ముఖ్యమైన మ్యాచుల్లో తిరిగి పుంజుకునే అవకాశం ఇస్తుంది' అని రవిశాస్త్రి సవరణ చేశాడు. 'కొన్నిసార్లు ఓడిపోవడం మంచిదే. మనలోని లోపాలను విశ్లేషించుకొని ముందుకుసాగడానికి అవకాశం లభిస్తుంది' అని జితేశ్ శర్మ కొనసాగించాడు. 'మేం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు 20 నుంచి 30 పరుగులు అధికంగా ఇచ్చాం. వాళ్లు పవర్‌ప్లేలో చక్కగా బ్యాటింగ్ చేశారు. వారి అటాకింగ్ బ్యాటింగ్‌కు నా దగ్గర సమాధానం లేదు. మొదటి ఆరు ఓవర్లలో మా బౌలర్లు తేలిపోయారు. అయినా.. మిడిల్, డెత్ ఓవర్లలో చక్కగా బంతులు సంధించారు' అని జితేశ్ శర్మ ఆర్సీబీ బౌలర్ల ఆటతీరు గురించి విశ్లేషించాడు. అలాగే టిమ్ డేవిడ్ గాయం విషయాన్ని కూడా ప్రస్తావించాడు. 'అతడి గాయంపై నాకు ఏవిధమైన సమాచారం లేదు. నేను ఔట్ అయిన తర్వాత కాస్త బాధలో ఉండిపోయాను' అని ముగించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ ఓటమి పాలైంది. ఇది పాయింట్ల పట్టికలో ఆ జట్టు రెండో స్థానం చేజిక్కించుకునే అవకాశాలపై ప్రభావం చూపింది. ప్రస్తుతం ఆ టీమ్ పంజాబ్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగే మ్యాచ్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంది.

